


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



- 113 -

## సావిత్రి పోరాటం

**అది కువైట్ దేశంలోని** ఫర్వానియా ప్రాంతం. ఆ ప్రాంతమంతా ఇసుకవేస్తే రాలనట్లుగా మన తెలుగువాళ్ళే నివసిస్తున్నారు. పార్టిషన్లు వేసి ఒక్కో ఇంటిని పది రూములుగా మార్చి బాడుగలకు ఇచ్చి వ్యాపారం చేసి లక్షలు సంపాదిస్తున్నారు.

చిన్నచిన్న ఇరుకు గదుల్లో ఆరేడుమంది సర్దుకుని వుంటూ అక్కడే వంటచేసుకుని తింటూ రాత్రిపూట అక్కడే పక్కలు వేసుకుని పడుకుంటూ దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు.

పొట్టకూటికోసం చిన్నచితకా పనులు చేసుకుంటూ ఇంటికి డబ్బు పంపిస్తూ అదే ప్రపంచంగా జీవిస్తున్నారు. అక్కడ వడ్డీ వ్యాపారాలు చేసేవాళ్ళు, వీసాలు అమ్మేవాళ్ళు, గదుల్లో సారా కాచి అమ్మేవాళ్ళు, అసాంఘిక కార్యకలాపాలు చేసేవారు కూడా వున్నారు. కువైట్ లో మద్యం, మత్తు పదార్థాలు, వ్యభిచారం నిషేధం. కానీ పరదేశీయులు పనులకోసం వచ్చి డబ్బుకోసం గడ్డి తింటూ చట్టానికి విరుద్ధంగా, చాటుగా చేసే నిర్వాకాలు ఎన్నో.

ఇంటి వెనక బాత్రూముల మధ్య వున్న సందులో ఒక చిన్న గది వుంది. అందులో రమణ, శీను, చంద్ర అనే కుర్రాళ్ళు వుంటున్నారు. వీళ్ళు సారా కాచడంలో ఆరితేరినవాళ్ళు. కువైట్ కు వచ్చి ఆరేళ్ళయింది. సారా కాచి అమ్మి లక్షలు సంపాదించారు. ఊళ్ళో మేడలు కట్టారు, పొలాలు కొన్నారు. ఇక ఊరెళ్ళి భార్యలను కువైట్ కు తీసుకు రావాలనేది వారి ఆలోచన.

అందరికీ పదేళ్ళలోపు పిల్లలున్నారు. వాళ్ళు బడికెళ్ళి చదువుకుంటున్నారు. పరదేశానికి పోయి ఆరేళ్ళయింది కదా అందుకే తల్లిదండ్రులు, భార్యలు, పిల్లలు వీరి రాకకోసం కళ్ళలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. ఒకసారి వచ్చి పొమ్మని చెపుతున్నారు.

కానీ దినారాలు సంపాదించే ధ్యాసలో వీళ్ళు అవన్నీ మర్చిపోయారు. డబ్బు సంపాదనే వీరి ధ్యేయం. డబ్బు సంపాదన కూడా ఒక జబ్బులాంటిదే.

అవినీతితో కూడిన కార్య కలాపాలు ఎంతో కాలం దాగవు. ఏదో ఒకరోజు బయటపడతాయి. ఎవడో తాగుబోతు ఒకరోజు పోలీసులకు ఉప్పందించాడు. అంతే.. పోలీసులు వచ్చి సారా కాస్తున్న ముగ్గుర్నీ పట్టుకుని చితకబాది జైల్లో వేసారు. వేసి కూడా సంవత్సరం దాటింది. ఇక వదుల్తారనే ఆశలేదు. కువైట్ లో చట్టాలను ఉల్లంఘిస్తే శిక్షలు కఠినంగా వుంటాయి.

ముసలి వాళ్ళయిన తల్లిదండ్రులు కొడుకుల మీద దిగులుతో కృంగిపోతున్నారు. భర్తల మాట వినబడక, ఉత్తరాలు రాక భార్యలు నిట్టూర్పులు విడుస్తున్నారు. తలచుకుని ఏడుస్తున్నారు. పిల్లలు నాయన ఎప్పుడు వస్తాడు అని అడుగుతుంటే వాళ్ళకు ఏం జవాబు చెప్పాలో వారికి అర్థం కావడం లేదు. వారిలో రమణ భార్య సావిత్రి కాస్త తెలివైనది. బాగా ఆలోచించి శీను భార్యను, చంద్ర భార్యను కలిసి "మన ముగ్గురం కొయేట్ పోదాం. మన భర్తలను విడిపించి ఇండియాకు తీసుకొద్దాం పదండి" అని చెప్పింది.

పిచ్చిదాన్ని చూసినట్టు చూసారు వాళ్ళు.

"అది ఇండియా అనుకుంటున్నావా..? లంచమో, కుంచమో ఇచ్చి బయటకు తేవడానికి. వృధా ప్రయాస" అంది శీను భార్య స్వప్న.

కళ్ళ నిండా నీళ్ళు నింపుకుని ఏడుస్తూ "పోదాం అక్కా! ఎలా వున్నారో ఏమో కనీసం మొహం అన్నా చూసి వద్దాం" అంది చంద్ర భార్య గౌరి.

కాసేపు తర్జనభర్జనలు పడి ముగ్గురూ కువైట్ పోవడానికే నిశ్చయించుకున్నారు. రెండు నెలలు తిరిగేసరికి వీసాలు వచ్చేసాయి. మరో పదిరోజుల్లో విమానం ఎక్కేసారు ముగ్గురూ. ఫర్వానియాలో బంధువులు వుంటే అక్కడికి పోయారు. అందరినీ వివరాలు అడిగి కనుక్కున్నారు.

ఒక లాయర్ ని కలిసి ఏం చేస్తే బయటికి వస్తారో ఏ మార్గాన ప్రయత్నించాలో తెలుసుకున్నారు. మొదట జైలుకు వెళ్ళి చూడాలనుకున్నారు. కొన్ని రోజుల నిరీక్షణ తర్వాత జైలు అధికారులు అనుమతినిచ్చారు.

ఎవరూ కలలో కూడా ఊహించలేదు ముగ్గురు ఆడవాళ్ళు ఇంతదూరం పరదేశానికి భర్తలను వెతుక్కుంటూ వస్తారని..!

ఒక్కోసారి ప్రయత్నిస్తే అసాధ్యాలు సుసాధ్యాలు అవుతాయి అనేందుకు వీరి కథే ఒక ఉదాహరణ.

కటకటాల వెనక బక్కచిక్కిన దేహాలతో వున్న భర్తలను చూసి ముగ్గురూ గొల్లుమని ఏడ్చారు.

శబ్దం చేయొద్దని పోలీసులు వారిని మందలించారు.

శీను, రమణ, చంద్ర తమ భార్యలను చూసి చాలా సంతోషించారు. ఆనంద భాష్పాలు రాల్చారు.

"ఎంత డబ్బు ఖర్చు అయినా సరే జైలునుండి విడిపిస్తాం. భయపడొద్దు" అని భర్తలకు ధైర్యం చెప్పారు వీళ్ళు.

సారా కాచి సంపాదించిన డబ్బు ఇంటిదగ్గర మూలుగుతోంది మరి..! నమ్మకం లేకపోయినా ఎక్కడో మిణుకుమనే చిన్న ఆశ.

ప్రయత్నం చేస్తే తప్పులేదు. పలుకుబడి వున్న సేట్లను కొందరిని కలిసి పరిస్థితి వివరించి, "వారు చేసిన తప్పును క్షమించమని విడుదల చెయ్యమని" వేడుకున్నారు.

"వదిలితే ఇండియాకు పోయి బుద్దిగా బ్రతుకుతామని ముసలి తల్లిదండ్రులు కొడుకుల కోసం, చిన్నబిడ్డలు తండ్రికోసం ఎదురు చూస్తున్నారని" దీనంగా చెప్పుకున్నారు.

లాయర్ ద్వారా అధికారులకు వినతి పత్రాలు అందించారు.

వీళ్ళ తెగువను కొందరు మెచ్చుకున్నారు. మరికొందరు "తప్పుడు పనిచేసి జైల్లో శిక్ష అనుభవిస్తున్నారు, బయటికి రావడం కల్ల. వీరికి పిచ్చి పట్టిందని" హేళన చేసారు.

అదొక హాట్ న్యూస్ అయింది.

కువైట్ లో తెలుగువాళ్ళు, ఇండియాలో బంధువులు, తెలిసినవాళ్ళు ఇదే విషయాన్ని మాట్లాడుకుంటున్నారు. ఆ భార్యల తెగువను మెచ్చుకుంటున్నారు. అంతవరకూ బంధువుల వద్ద తలదాచుకున్న ముగ్గురూ అక్కడే ఫర్వానియాలో ఒక రూము బాడుగకు తీసుకుని అవసరమైనవి కొని అమర్చుకున్నారు. అలా ఆర్నెల్లు గడిచాయి. ఈ లోపల ఇంటి దగ్గర శీను వాళ్ళ అమ్మ జబ్బుతో కాలం చేసింది. శీను దిగులు పడ్డాడు. తల్లిని తలచుకుని ఏడ్చాడు. రమణ, చంద్ర అతడిని ఓదార్చారు.

ఇక జన్మలో బయటి ప్రపంచాన్ని, తమవాళ్ళను చూడలేమని, కువైట్ చట్టాన్ని ఉల్లంఘించి తప్పుచేసామని చెప్పుకుని ఏడ్చారు.

తమ పలుకుబడిని, డబ్బును ఉపయోగించి షేకులను కూడా కలిసి "భర్తల యెడల దయ చూపమని వేడుకున్నారు" ఈ ముగ్గురు స్త్రీలు.

ఈ లోపల ఒక మినిస్టర్ ను కూడా కలిసారు.

ఆ మినిస్టర్ కు కారు డ్రైవర్ గా స్వప్న చిన్నాన్న కొడుకు పని చేస్తున్నాడు. వాడి ద్వారా ఆయనను కలిసి తమ పరిస్థితిని వివరించారు.

ఆయన "అలా కుదరదని తప్పు చేసిన వాళ్ళకు కువైట్ లో శిక్షలు కఠినంగా వుంటాయని" చెప్పి పంపేసాడు. వీళ్ళ ఆశలన్నీ నిరాశలయ్యాయి.

దిక్కు తోచలేదు. ముగ్గురూ ఒకర్నొకరు పట్టుకుని "మన గతి ఇంతేనా" అనుకుంటూ గొల్లుమన్నారు. ఈ విషయం జైల్లో వున్న ముగ్గురికీ తెలిసింది.

ఇక జన్మలో బయటికి పోలేమని, తమ దేశానికి పోయి తల్లిదండ్రులను, పిల్లలను  చూడలేమని భావించి నిరాశ చెందారు.

వీరిలో చంద్ర కొంచెం సున్నితమనస్కుడు. అతడు బాగా కృంగిపోయాడు. అన్నం కూడా తినకుండా జైలు గోడకు ఆనుకుని కూర్చుని ఆలోచన చెయ్యడం మొదలుపెట్టాడు. ఒకరోజు రాత్రిపూట జైల్లోనే గుండెపోటుతో మృతి చెందాడు.

చంద్ర భార్య గౌరి వేదన వర్ణనాతీతం. గుండెను దిటవు చేసుకుని చంద్ర మృతదేహాన్ని తీసుకుని ఇండియాకు వెళ్ళింది. చంద్ర అమ్మనాన్నల దు:ఖానికి అంతులేదు. జైల్లోని రమణ, శీను కూడా స్నేహితుని మరణానికి చింతించారు.

డబ్బుకోసం తప్పుపని చేసి పరదేశంలో  ఇరుక్కుపోయినందుకు పశ్చాతాపంతో ఏడ్చారు.

కాలం ఎవరికోసమూ ఆగదు. మరో ఆర్నెల్లు గడిచాయి. స్వప్న, సావిత్రిల ధైర్యం సన్నగిల్లింది.

అందరూ మీ ప్రయత్నం వ్యర్థం, కువైట్ లో శిక్షను తప్పించడం అసాధ్యం. "మీరు తిరిగి ఇండియాకు వెళ్ళండి" అని సలహాలు ఇస్తున్నారు.

దిక్కుతోచని స్వప్న "మనం వచ్చి సంవత్సరం దాటింది అక్కా. వీళ్ళను విడిపించడం మనవల్ల కాదు. ఇంటి దగ్గర పిల్లలు ఏడుస్తున్నారు. ఇంటికి పోదాం పద" అనింది.

తల అడ్డంగా తిప్పింది సావిత్రి. "నేను రాను స్వప్నా. నువ్వు పో. వస్తే రమణాతో కలిసి ఇంటికి వస్తాను. లేదంటే నా శవమన్నా ఇండియాకు రావాలి. పలుకుబడి గల సేట్ల కాళ్ళు పట్టుకుంటాను. ఏ ఒక్కరి మనసన్నా కరగకపోదు. నువ్వు బయల్దేరి వెళ్ళు అమ్మీ" అనింది.

సావిత్రి పట్టుదలకు నివ్వెరపోయింది స్వప్న.

'సరే అక్కా.. నీ ఇష్టం' అని చెప్పి టికెట్ తీసుకొని విమానం ఎక్కింది.

సావిత్రి ఒంటరిగా మిగిలింది కానీ తన పనిని, ప్రయత్నాన్ని ఆపలేదు. తెలిసిన వాళ్ళందరినీ అడుగుతోంది. కనపడిన సేట్ల కాళ్ళు పట్టుకుని కన్నీళ్ళతో అర్థిస్తోంది. కాలం ఎవరికోసమూ ఆగదు.

ఐదేళ్ళు గడిచిపోయాయి. ఈ లోపల ఖాళీగా వుండకుండా ఒక షేకు ఇంట్లో పనికి కుదిరింది సావిత్రి. మరో ఐదేళ్ళు గడిచాయి. ఏళ్ళు గడిచేకొద్దీ ఆమెలో కూడా ధైర్యం సన్నగిల్లసాగింది. అయినా దు:ఖాన్ని దిగమ్రింగి తెలియని ఆశతో నిరీక్షించసాగింది. ఇంటివద్ద పిల్లలు కూడా పెద్దవాళ్ళయి కాలేజీ చదువులకు వచ్చారు.

అపుడపుడూ జైలుకు వెళ్ళి రమణను చూసి వస్తోంది సావిత్రి.

ఒకరోజు సావిత్రి పనిచేసే ఇంట్లో సేటు కొడుకు పెళ్ళి కుదిరింది. ఆ సందర్భంగా దువానియా ఏర్పాటు చేసారు.

ఇంటికి సేటు స్నేహితులు, బంధువులు చాలామంది వచ్చారు. వారిలో కువైట్ రాజుకు స్నేహితుడైన షేకు మహ్మద్ కూడా వున్నాడు. వెళ్ళి ఆయన కాళ్ళమీద పడి ఏడ్చింది సావిత్రి.

వారి కథ విని ఆయన మనసు కరిగింది."తప్పకుండా సహాయం చేస్తానని" మాట ఇచ్చాడు.

కువైట్ షేకులు మాట ఇస్తే తప్పరు. పట్టుదలగా పని చేస్తారు. కువైట్ రాజుకు మిత్రులు కావడంతో ఆయన మాట కాదనే ధైర్యం ఎవరికీ లేదు. ఇక్కడ పాలన అంతా రాజుదే కాబట్టి ఆయన మాటకు ప్రాముఖ్యత ఎక్కువ. రెండ్రోజుల్లో రమణను బయటికి తెచ్చాడు ఆయన.

"మరోసారి సారా కాచే పని చెయ్యొద్దని వార్నింగ్ ఇచ్చి ఇక ఇండియాకు వెళ్ళమన్నారు."

"దయచేసి శీనూను కూడా విడిపించండి సేటూ. ఇంటివద్ద వాడి భార్య పిల్లలు ఆశగా ఎదురుచూస్తున్నారు. అల్లా మిమ్మల్ని దయ చూస్తాడు" అని అర్థించింది సావిత్రి.

"ఒకేసారి ఇద్దర్నీ విడిపించడం కష్టం. ఇంకో ఆర్నెల్లు పోతే ప్రయత్నిస్తాను. ఇప్పుడు మీరు ఇండియాకు వెళ్ళండి" అన్నాడు సేటు.

"షుక్రాన్ బాబా" అంటూ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు

బ్రతుకు జీవుడా అనుకుంటూ విమానమెక్కి ఊళ్ళోకి వచ్చి పడ్డారు. ఊళ్ళోవారందరూ పదేళ్ళపాటు పరదేశంలో సావిత్రి చేసిన పోరాటాన్ని మెచ్చుకున్నారు.

శీనూ భార్య స్వప్న వచ్చి "అక్కా మా ఆయన సంగతి ఏమయ్యింది. నువ్వు సేటును అడగలేదా" అని బాధపడింది.

"ఎందుకు అడగలేదు స్వప్నా.. తొందరలో ప్రయత్నిస్తాను అన్నాడు సేటు. చూద్దాం" అంది సావిత్రి.

స్వప్న భర్తకోసం ఆశగా ఎదురు చూసింది. శీను ఇంటికి రావడానికి మరో మూడేళ్ళు పట్టింది.

రమణ, శీను మరెప్పుడూ చట్ట వ్యతిరేకమైన పనులు చెయ్యకుండా పదిమందికీ మంచి చేస్తూ పద్ధతిగా జీవించారు.

*(మరోకథ వచ్చేనెలలో)*



Post your comments